పనిచేయని కిషన్.. క్యారెక్టర్ లేని దానం

- ఎంపీ ల్యాడ్స్ నిధులూ ఖర్చు చేయని కిషన్‌రెడ్డి
- మళ్లీ గెలిచినా ఆయన ప్రజలకు చేసేందేముంది?
- అధికారం ఎక్కడ ఉంటే దానం అక్కడే ఉంటాడు
- సమస్యలపై పార్లమెంట్‌లో ప్రజా గొంతుకవుతా
- భారీ మెజార్టీతో లష్కర్‌పై గులాబీ జెండా ఎగరేస్తా
- 'నమస్తే తెలంగాణ'తో బీఆర్‌ఎస్ పార్టీ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి పద్మారావు గౌడ్ ధీమా

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): 'పజ్జన్న అంటే అషామాషీ కాదు.. ఎల్లవేళలా ప్రజా గొంతుకై నిలబడే వ్యక్తి.. పద్మారావు కాడికి పోతే సమస్య ఎలాంటిదైనా పరిష్కారం చూపుతాడన్న నమ్మకం నియోజకవర్గ ప్రజల్లో ఉన్నది. ఇప్పుడు ఆ నమ్మకాన్నే హైదరాబాదీ బిడ్డగా పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు అందిస్తా. సమస్యలపై పార్లమెంట్‌లో గళం విప్పి నియోజకవర్గ, రాష్ట్ర అభివృద్ధికి నా వంతు ప్రయత్నం చేస్తా. ఎంపీ ల్యాడ్స్ నిధులూ కూడా ఖర్చు చేయని ఏకైక ఎంపీ కిషన్‌రెడ్డి. మళ్లీ గెలిచినా ఆయన ప్రజలకు చేసేందేముంటది? దానం నాగేందర్‌కు క్యారెక్టర్ లేదు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడే ఉంటాడు. లష్కర్ ప్రజల మద్దతు నాకే ఉన్నది. భారీ మెజార్టీతో గులాబీ జెండా ఎగరేస్తా' అని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి టీ పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల మంచి చెడు ఏదైనా అండగా ఉండే వ్యక్తినని చెప్పారు. ఎంపీగా గెలిచి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేని కిషన్‌రెడ్డికి ఈ సారి ఓటమి తప్పదని అన్నారు. అలవికాని హామీలు, మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలన నాలుగు నెలలకే ప్రజలకు అర్థమైందని, హస్తం అభ్యర్థులకు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తోటి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ఉద్యమకారులు, కార్యకర్తలు, అభిమానులు అందరి కలిసికట్టుగా ప్రజల్లోకి వెళ్తున్నామని, అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌కే మరోసారి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి తన గెలుపునకు బాట అని, ఈ ఎన్నికల్లో లష్కర్‌పై గులాబీ జెండాను ఎగరవేసి పార్టీ అధినేత కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇవ్వబోతున్నట్టు పద్మారావు గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు.

పద్మారావుకే ఎందుకు ఓటు వేయాలి? అంటే ఏం చెప్తారు?

నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచా అంటేనే నా నియోజకవర్గ ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకం.. నేను ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే వ్యక్తిని. ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే వాడిని. నా నియోజకవర్గ ప్రజలకే కాదు.. హైదరాబాద్ ప్రజలకు పజ్జన్నగా సుపరిచితుడిని. పద్మారావు వద్దకు వెళితే సమస్య ఎలాంటిదైనా పరిష్కారం చూపుతాడన్న నమ్మకం నియోజకవర్గ ప్రజల్లో ఉన్నది. ఆ నమ్మకానే పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు అందిస్తా. ప్రజా గొంతుకై పార్లమెంట్‌లో గళం వినిపిస్తా. 14 ఏండ్లు జై తెలంగాణ అన్నోడిని.. పార్లమెంట్‌లో గొంతు ఎత్తడం పెద్ద సమస్యే కాదు.

ప్రచారం ఎలా సాగుతున్నది? ప్రజల స్పందన ఎలా ఉన్నది?

పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రమే కాదు హైదరాబాద్ నగరం గణనీయమైన అభివృద్ధిని సాధించింది. అపారమైన అనుభవం, ముందుచూపు గల నేత కేసీఆర్ మార్గదర్శకంలో పురపాలకశాఖ మంత్రిగా తారక రామారావు హైదరాబాద్‌కు వన్నే తీసుకొచ్చి ప్రపంచ దేశాలు మనవైపు చూసేలా చేశారు. జోడెద్దులా మాదిరిగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాయి. దురదృష్టవశాత్తు అలవికాని హామీలు ఇచ్చి.. అరచేతిలో స్వర్గం చూపించినట్టు నోటికొచ్చిన హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కానీ, నాలుగు నెలల్లోనే రైతాంగం, గ్రామీణ ప్రజల్లో పొరపాటు చేశామనే భావన కనబడుతున్నది. పాదయాత్ర సమయంలో రూరల్ ఓటర్లు ఇదే రీతిలో స్పందిస్తున్నారు. పదేండ్ల అభివృద్ధి ముద్దు.. వంద రోజుల అబద్ధాలు వద్దని సబ్బండ వర్ణాల ప్రజలు అంటున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఘోర పరాభావం తప్పదు.

నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో మీరు ఏం గమనించారు?

ప్రజల శ్రేయస్సే ముఖ్యమనే ధోరణిలో పరిపాలన సాగాలి. కానీ ఈ ప్రభుత్వం ఒక్క రాజకీయ దృష్టితో కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నదే తప్ప సాగు, తాగునీటిపై ఎలాంటి ఆలోచన చేయడం లేదు. అవగాహనారాహిత్యం కొట్టొచ్చినట్టుగా కనబడుతున్నది. అనుభవం ఉన్న వారిని కలుపుకుని పోతేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయి. కానీ, ఇప్పుడున్న వారికి అనుభవం లేకనే ఈ సమస్యలు. బెంగళూరులో ప్రజలు తాగునీటికి అల్లాడిపోతున్నారు? హైదరాబాద్‌లో తాగునీటి ఎద్దడి చాలా బస్తీలు, కాలనీల్లో ఉన్నది. మూడు రోజులైనా వాటర్ ట్యాంకర్ దొరకని దుస్థితి. వాటర్ ట్యాంకర్ భారం కనీసంగా ఒక్క అపార్ట్‌మెంట్‌పై నెలకు రూ.15 వేలు పడుతున్నది. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం. బీఆర్‌ఎస్ పాలనలో తాగు, సాగునీటిని అత్యధిక ప్రాధాన్యం ఇచ్చాం. ఆ దిశగా ఫలితాలు రాబట్టాం. కానీ, కాంగ్రెస్ పాలకుల తీరుతో ముున్ముందు మరిన్నీ సమస్యలు ఎదురవుతాయి.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, మరో అవకాశం ఇవ్వాలని కిషన్‌రెడ్డి అంటున్నారు.. మీరెమంటారు?

సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి గెలిచిన కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి అయిండు కానీ.. ఆ సంతోషాన్ని ప్రజలకు ఇవ్వలేకపోయిండు. నియోజకవర్గంలో ఏనాడూ అందుబాటులో లేడు. కేంద్రమంత్రిగా కోట్ల నిధులతో అభివృద్ధి చేసే అవకాశం ఉంటది. కానీ కిషన్‌రెడ్డి అదనపు నిధులు కాదు కదా.. కనీసం ఎంపీ ల్యాడ్స్ నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయకుండా దేశంలోనే ఏకైక ఎంపీగా కిషన్‌రెడ్డి నిలిచిండు. నాకు తెలిసి నియోజకవర్గంలో కిషన్‌రెడ్డి రెండే రెండు అతి గొప్ప పనులు చేసిండు. ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ఒకటి, ఓ స్కూల్ వద్ద రేకుల షెడ్డులు వేసిండు. కానీ మా ప్రభుత్వంలో ఒక్క హైదరాబాద్‌లోనే 34 ఎస్‌ఆర్‌డీపీ ప్రాజెక్టులు చేపట్టాం. కిషన్‌రెడ్డి మాత్రం అంబర్‌పేట ఫ్లై ఓవర్ ఒక్కటి పూర్తి చేయలేక పోయిండు.

బీజేపీ సెంటిమెంట్ రాజకీయాలపై మీ అభిప్రాయం?

హిందువులు అనేది బీజేపీకి ఏదైనా ఆధార్ కార్డా? వాళ్లు జై శ్రీరామ్ అంటే.. మనం ఏమైనా జై రావణాసురా.. అంటమా? బీజేపీ కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడానికే మతాన్ని తెరమీదకు తెస్తున్నది. ఈ మత తత్వ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌కు కొమ్ముకాసి సామాన్యుడి జీవనాన్ని చిన్నాభిన్నం చేసిందని ప్రజలకు అర్థమైంది. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఓ మినీ ఇండియా. ఉత్తర భారతీయులతోపాటు క్రైస్తవులు, మైనార్టీలు ఇలా సబ్బండవర్ణాలతో కులాలకు, మతాలకు అతీతంగా బీఆర్‌ఎస్ పాలనలో అందరినీ కడుపులో పెట్టుకుని చూసుకున్నాం. మున్సిపల్ ఎన్నికల్లో అమిత్‌షా, నితిన్ గడ్కరీ లాంటి అగ్రనేతలు వచ్చి ప్రచారం చేసినా ఐదింటికి ఐదు కార్పొరేషన్ స్థానాలను గెలిచాం. ఇది ఇక్కడి ప్రజలకు ఉన్న చైతన్యం. కిషన్‌రెడ్డి ఈ నియోజకవర్గంలో ఫెయిల్ అయిండు కాబట్టే మేం అత్యధిక మెజార్టీతో లష్కర్‌పై గులాబీ జెండాను ఎగరవేయబోతున్నాం.

దానం నాగేందర్ మీ పార్టీని విడిచి ప్రత్యర్థిగా బరిలోకి దిగారు? దీనిని మీరేలా చూస్తారు?

దానం నాగేందర్ క్యారెక్టర్ లేని వ్యక్తి. ఆ వ్యక్తి గురించి నాకంటే నియోజకవర్గ ప్రజలకే బాగా తెలుసు. ఇంటి నుంచే బయటకు రాలేని దుస్థితిలో ఉన్నాడు. దానం అధికారం ఎక్కడ ఉంటే అక్కడ ఉంటాడు. గతంలో టీడీపీ నుంచి కాంగ్రెస్‌కు, కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వెళ్లిన దానం.. గతంలోనే ప్రజల చేతిలో ఓడిపోయాడు. ఇప్పుడు కూడా దానంకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నరు.

అమిత్‌షా విజయ సంకల్ప సభలో సహారా ఇండియా బాధితుల నిరసన

నేతలు ఫుల్లు.. జనం నిల్లు

- సిద్దిపేట, నిజామాబాద్‌లో బీజేపీ సభలు వెలవెల
- అమిత్‌షా మాట్లాడుతుండగా ఖాళీ కుర్చీలు దర్శనం
- షాకు 'సహారా ఇండియా' బాధితుల నుంచి నిరసన సెగ

సిద్దిపేట/వినాయక నగర్/సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 25: సిద్దిపేట, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ గురువారం నిర్వహించిన సభలు జనం లేక వెలవెలబోయాయి. వేదికలపై నేతలు ఫుల్లుగా ఉన్నా.. సభా ప్రాంగణాలు జనం లేక బోసిపోయాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సిద్దిపేట సభకు ఆలస్యంగా రావడంతో ప్రజలు సభ నుంచి వెళ్లిపోయారు. దీంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అమిత్‌షా మధ్యాహ్నం 1:56 నిమిషాలకు సభ వేదికపై చేరుకొని ప్రసంగాన్ని ప్రారంభించి 2:05 నిమిషాలకు ముగించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన సభలో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ప్రసంగించే సమయానికి జనం వెళ్లిపోయారు. ఆ సమయంలో కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. ఈ సభలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు. దీంతో పాటు సహారా ఇండియా బాధితుల నుంచి కూడా నిరసన సెగ తగిలింది. సహారా ఇండియాలో రాష్ట్రం నుంచి చాలా మంది పెట్టుబడులు పెట్టి నష్టపోయారు. అమిత్‌షా సభ సిద్దిపేటలో ఉందని తెలుసుకొని పెద్దపల్లి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, వరంగల్ సిద్దిపేట తదితర ప్రాంతాల నుంచి సహారా ఏజెంట్లు, ఖాతాదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సహారా ఇండియాలో పెట్టుబడులు పెట్టి నష్టపోయామని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.

కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారింది

తెలంగాణను కాంగ్రెస్ ఏటీఎంగా మార్చుకుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆరోపించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బీజేపీ మెదక్ పార్లమెంట్ విజయ సంకల్పయాత్ర సభ జరిగింది. ఈ సభలో అమిత్‌షా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, ప్రజలు 12 ఎంపీ సీట్లు ఇచ్చి మోదీని ప్రధానిగా చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చాకా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని చెప్పారు.

రిజర్వేషన్ల రద్దే బీజేపీ ఎజెండా

- ఆర్‌ఎస్‌ఎస్ విధానమే అమలు
- పీసీసీ అధినేత, సీఎం రేవంత్ రెడ్డి
- బీజేపీపై చార్జ్‌షీట్ విడుదల

గాంధీభవన్‌లో బీజేపీపై చార్జ్‌షీట్‌ను విడుదల చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేయడమే ఆ పార్టీ విధానమని పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ విధానాన్నే బీజేపీ అమలు చేస్తోందని విమర్శించారు. గాంధీభవన్‌లో గురువారం బీజేపీపై రేవంత్ రెడ్డి ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో పదేండ్ల బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలు, కుట్రలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్లు రద్దే బీజేపీ ఎజెండా అని, అందుకు 400 ఎంపీ సీట్లు లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. 2025లోగా రిజర్వేషన్లను రద్దు చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ విధానమని ఆరోపించారు. ఎలాగైనా రిజర్వేషన్ల రద్దుకు మోదీ కుట్ర చేస్తున్నారని సీఎం ఆరోపించారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని రాహుల్ గాంధీ స్పష్టంగా ప్రకటించారని, దీనిని అడ్డుకునేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీజేపీకి వేసే ప్రతీ ఓటు రిజర్వేషన్ల రద్దుకు వేసినట్లేనని, వర్గీకరణ కోసం కొట్లాడిన వారు కూడా బీజేపీకి ఎందుకు మద్దతు ఇస్తున్నారో తెలియడంలేదని పరోక్షంగా ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణపై ధ్వజమెత్తారు. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ వైపు నిలబడొద్దని, ఈ ఎన్నికలు రిజర్వేషన్లు వర్సెస్ రిజర్వేషన్లు రద్దుగా రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. రైతుల పోరాటంతో నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్న మోదీ.. పార్లమెంట్ సాక్షిగా రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చేనేత నుంచి కుటీర పరిశ్రమల వరకు జీఎస్టీ పేరుతో పేదల శ్రమను దోచుకుందని ధ్వజమెత్తారు. ప్రజలపై రూ.168 లక్షల కోట్ల అప్పులభారం మోపి, పదేండ్లలో రూ.113 లక్షల కోట్లు అప్పులు తెచ్చి దేశాన్ని తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, ప్రభాకర్, సురేఖ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాసు మున్షీ, నాయకులు జగ్గారెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, ఎల్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

అవి ఉత్త కోతలు!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	44.9°c	32.3°c
ఆదిలాబాద్	43.8°c	24.2°c
మహబూబ్‌నగర్	43.2°c	25.0°c
మెదక్	42.8°c	22.0°c
రంగారెడ్డి	42.4°c	20.6°c
ఖమ్మం	42.0°c	26.0°c
నిజామాబాద్	41.4°c	27.3°c
వరంగల్	41.0°c	27.0°c
హైదరాబాద్	41.0°c	28.6°c
కరీంనగర్	41.0°c	27.0°c

ప్రభుత్వ న్యాయవాది ద్వారా స్పీకర్‌కు ఫిర్యాదు

- ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై రాష్ట్ర హైకోర్టు ఆదేశం
- కడియం, దానం, తెల్లం ఫిరాయింపుపై పిటిషన్ విచారణ
- విచారణ ఈ నెల 29కి వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్ 25, (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై ఫిర్యాదును ప్రభుత్వ న్యాయవాది ద్వారా స్పీకర్‌కు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు పిటిషనర్ తరఫు న్యాయవాదికి సూచించింది. సదరు ఫిర్యాదును అందుకున్నట్టుగా స్పీకర్ కార్యాలయం నుంచి ధ్రువీకరణ రశీదు కూడా తీసుకోవాలని తెలిపింది. బీఆర్‌ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేలుగా గెలుపొందిన కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావుపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసే అవకాశాన్ని అసెంబ్లీ కార్యదర్శి తమకు కల్పించలేదంటూ పిటిషనర్ చేసిన విజ్ఞప్తిని హైకోర్టు పరిగణనలోకి తీసుకున్నది. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోపై ఎమ్మెల్యేలుగా గెలిచిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరి పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని, వారిపై అనర్హత వేయాలనే ఫిర్యాదులను స్పీకర్ కార్యాలయం స్వీకరించకపోవడం వల్లే పిటిషన్ దాఖలు చేసినట్టు కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద హైకోర్టుకు తెలిపారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. స్పీకర్‌కు ఫిర్యాదు చేసేందుకు ఈ నెల 3న, 9న వెళితే అనుమతి లభించలేదని తెలిపారు. స్పీకర్‌ను కలిసేందుకు అనుమతి ఇవ్వలేదని చెప్పారు. దీంతో ఈ నెల 10న రిజిస్టర్ పోస్టు, ఇ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశామని, దానికి ధ్రువీకరణ కూడా ఇవ్వలేదన్నారు. రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన కవర్ తిరిగి వెనక్కి వచ్చేసిందని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం స్పీకర్ అనర్హత పిటిషన్లను స్వీకరించాలన్నారు. బీఆర్‌ఎస్ తరఫున గెలుపొందిన కడియం, వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరారని, కడియం కుమార్తె కావ్యకు వరంగల్ ఎంపీ టికెట్ కూడా కాంగ్రెస్ ఇచ్చిందని చెప్పారు. అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కల్పించుకుంటూ.. ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదని, పిటిషన్లను ప్రభుత్వ న్యాయవాది ద్వారా స్పీకర్ కార్యాలయానికి పంపే ఏర్పాట్లు చేస్తామన్నారు. స్పందించిన హైకోర్టు.. స్పీకర్‌కు ఫిర్యాదు కాపీలు అందనప్పుడు కడియం, వెంకట్రావుపై అనర్హత వేటువేయాలని ఎలా ఉత్తర్వులు ఇవ్వగలమని పిటిషనర్‌ను ప్రశ్నించింది. పిటిషనర్ ఫిర్యాదును ప్రభుత్వ న్యాయవాది ద్వారా స్పీకర్‌కు పంపేలా ఉత్తర్వులు ఇస్తామని చెప్పింది.

దానంపై కూడా..

ఖైరతాబాద్ నుంచి బీఆర్‌ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందిన దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల చట్టానికి వ్యతిరేకమంటూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన మరో పిటిషన్‌ను జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదిస్తూ.. దానం సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారని, ఆయనకు కాంగ్రెస్ బీ-ఫారం ఇచ్చిందని తెలిపారు. అఫిడవిట్‌ను కూడా ప్రభుత్వ న్యాయవాది ద్వారా స్పీకర్ కార్యాలయానికి పంపేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అందుకు న్యాయమూర్తి సమ్మతించారు. అనంతరం పిటిషనర్ల తరఫు న్యాయవాది సంతోష్‌కుమార్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలన్న ఫిర్యాదు కాపీలను ప్రభుత్వ న్యాయవాది మోహనారెడ్డికి అందజేశారు. వాటిని స్పీకర్ కార్యాలయానికి పంపినట్టుగా సోమవారం తమకు తెలియజేయాలని హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది. ఈ కేసుపై తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.

సివిల్ సర్వెంట్లకు పవర్, దయ అవసరం : గవర్నర్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): సివిల్ సర్వెంట్లుకు అధికారం, ఇతరుల పట్ల దయ కలిగి ఉండాలని రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. గురువారం హైదరాబాద్ సంస్కృతి హాల్‌లో ఇన్‌స్పైర్-2024 పేరిట కార్యక్రమం నిర్వహించారు. దీనికి గవర్నర్ హాజరై, ఇటీవల విడుదలైన 2023 సివిల్ సర్వీస్ ఎగ్జామ్ టాప్ ర్యాంకర్లతో సమావేశమయ్యారు. పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. టాపర్లతో పాటు వారి కుటుంబాలను గవర్నర్ సన్మానించారు. కార్యక్రమంలో రాజ్‌భవన్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉన్నారు.

25 వరకు 'లాసెట్' గడువు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): న్యాయవాద కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ లాసెట్, పీజీలాసెట్ దరఖాస్తుల గడువును మే 4 వరకు పొడిగించినట్టు అధికారులు తెలిపారు. ఈ గురువారం గడువు ముగియగా, మరో అవకాశం ఇస్తున్నట్టు లాసెట్ కన్వీనర్ బీ విజయలక్ష్మీ తెలిపారు.

బీసీ గురుకులాల జయకేతనం

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : జేఈఈ మెయిన్ ఫలితాల్లో బీసీ గురుకుల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. ఫలితాల్లో కే శ్రీనివాస్ 97.51, ఈ వైష్ణవి 96.78 పర్సంటైల్ సాధించారు. మొత్తంమీద 44 మంది అబ్బాయిలు, 28 మంది అమ్మాయిలు అర్హత సాధించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం విద్యార్థులను అభినందించారు.

ఏఈ జీఆర్ జాబితా విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలలో అసిస్టెంట్ ఇంజినీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్‌ఎల్)ను గురువారం వెల్లడించారు. ఫలితాల జాబితాను https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది.

మూడు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు అటానమస్ హోదా

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని మూడు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు అటానమస్ హోదా దక్కింది. న్యాక్ గుర్తింపు ఆధారంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ బోధన్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఖైరతాబాద్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ కరీంనగర్‌కు అటానమస్ హోదా కల్పిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తాజాగా ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కోదాడకు కూడా అటానమస్ హోదా దక్కాల్సి ఉన్నది. చిన్న కారణం చేత ఇది నిలిచినట్టు తెలిసింది.

పైసలు పంచినా ఓట్లెందుకు పడలే?

- పెంట్లవెల్లిలోనే ఎక్కువ డబ్బులు ఖర్చు చేసిన!
- కాంగ్రెస్ నాయకులను నిలదీసిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఎన్నికల వేళ వైరల్‌గా మారిన మంత్రి వ్యాఖ్యలు
- ఈసీ చర్యలు తీసుకోవాలని సోషల్‌మీడియాలో ట్రోల్స్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందా? అనే ప్రశ్నకు ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు అవుననే బలం చేకూరుస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలు పార్లమెంట్ ఎన్నికల వేళ సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. కొల్లాపూర్‌లోని పెంట్లవెల్లి లో ఇటీవల కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 'రేమద్దులలో (సర్పంచులు, ఎంపీటీసీలు) అందరూ వాళ్లే.. అక్కడ 900 మెజారిటీ వచ్చింది. చిన్నంబావిలో ఎంపీపీలు, జడ్పీటీసీలు వాళ్లే.. అధికారులు వాళ్లే.. పెత్తనం కూడా వాళ్లదే. అక్కడ కూడా సుమారు 300-400 మెజారిటీ వచ్చింది. పెంట్లవెల్లిలో ఏం తక్కువ చేసినం, మరి ఎందుకు ఓట్లు రాలే' అంటూ కార్యకర్తలపై మండిపడ్డారు. మధ్యలో కార్యకర్తలు, నాయకులు కలుగజేసుకొని సర్ది చెప్పే ప్రయత్నం చేస్తుంటే.. 'వినండి.. వినండి.. అన్ని చోట్ల కంటే ఎక్కువగా పెంట్లవెల్లిలోనే ఖర్చుపెట్టిన. ఇక్కడ పెట్టిన ఖర్చు ఎక్కడా పెట్టలేదు. ఎందుకు ఓట్లు రాలేదు?' అంటూ కార్యకర్తలను ప్రశ్నించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. దీంతో కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం అడ్డగోలుగా డబ్బులు ఖర్చు పెట్టిందని ఆ మంత్రి మాటలతో స్పష్టమవుతుందని విపక్షాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. సదరు మంత్రిపై వెంటనే చర్యలు తీసుకోవాలని నేటిజన్లు సోషల్‌మీడియాలో ట్రోల్స్ చేస్తున్నారు.

కేసీఆర్ ప్రకటనలపై చర్చకు సిద్ధం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్తు రంగంపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటనలపై చర్చకు సిద్ధమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. గురువారం ఆయన ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. దీర్ఘకాలిక అవసరాల కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు చేశామన్న కేసీఆర్ మాటల్లో వాస్తవంలేదని స్పష్టం చేశారు. యూనిట్‌కు రూ.3.90 పెట్టి కొన్నామని కేసీఆర్ ప్రకటించారని, కానీ యూనిట్‌కు రూ.20 చొప్పున చెల్లించి కొనుగోలు చేసిన మాట వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ఎన్టీపీసీ నుంచి యూనిట్‌కు రూ.15 చొప్పున కొనుగోలు చేస్తామంటే ఒప్పుకోలేదని కేసీఆర్ అన్నారని, కానీ ఎన్టీపీసీ రూ.5.60కే యూనిట్ చొప్పున 1600 మెగావాట్లు సరఫరా చేసిందన్నారు. 2023 డిసెంబర్ నుంచి తెలంగాణ డిస్కమ్‌లు కొనుగోలు చేసిన విద్యుత్తు ఒక్కో యూనిట్ ధర రూ.5.34 మాత్రమే నన్నారు. 2012లోనే హైదరాబాద్ పవర్ ఐలాండ్‌కు తాము రూపకల్పన చేశామని, ఆయా అంశాలపై చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు.

యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు పర్యావరణ అనుమతులు

యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు పర్యావరణ అనుమతులొచ్చేందుకు సహకరించిన వారికి మంత్రి భట్టి ధన్యవాదాలు తెలిపారు. ఎన్జీటీ సూచించిన షరతుల మేరకు అన్నింటినీ పూర్తి చేసి అనుమతులు సాధించడం గొప్పవిషయమని ఓ ప్రకటనలో ప్రశంసించారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. నెలల్లో సమీక్షించి, పనుల్లో వేగం పెంచినందునే పర్యావరణ అనుమతుల జారీ అయ్యాయని చెప్పారు.

కరెంట్ కాటుకు కౌలు రైతు బలి

పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి తెగి పడిన వైరుకు తగిలి మృతి

నర్సయ్య (ఫైల్)

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 25: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన ఓ కౌలు రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా రూరల్ మండలం తిప్పన్నపేటలో చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తిప్పన్నపేటకు చెందిన కౌలు రైతు నలువాల నర్సయ్య (57) ఎకరన్నర భూమిని కౌలుకు తీసుకొని కొద్దిరోజులుగా సాగు చేస్తున్నాడు. గురువారం ఉదయం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. అప్పటికే పొలం వద్ద తెగిపడి ఉన్న ఎల్‌టీ విద్యుత్తు వైరు తగలడంతో షాక్ కొట్టి మృతి చెందాడు. తమ పొలం వద్ద విద్యుత్తు వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని చెబుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ దారుణం జరిగిందని నర్సయ్య కొడుకు రమేశ్ ఆరోపించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. నర్సయ్యకు భార్య, కొడుకు ఉన్నారు. కొడుకు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. విద్యుత్తు ఏడీ జవహర్‌లాల్ నాయక్, ఏఈ సురేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా గురువారం అన్ని జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా భద్రాచలంలో 44 డిగ్రీలు, ఖమ్మంలో 43.4, నల్లగొండలో 42.8, నిజామాబాద్‌లో 42.7, రామగుండంలో 42.4 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. నిన్నమొన్నటి వరకు వర్షాలు కురిసి కాస్త చల్లబడ్డా.. ఇప్పట్లో వర్షాలు లేనట్టేనని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం నుంచి ఎండలు మరింత పెరుగుతాయని హెచ్చరించారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 నుంచి 45 డిగ్రీల వరకు పెరిగే సూచన ఉన్నట్టు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వైద్య నిపుణులు సూచించారు.

రోహిణి రాకముందే రోళ్లు పగుల్తున్నయ్!

ఎల్ నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలకు మించి వేడిమి

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయని నానుడి. ప్రస్తుత ఎండలను చూస్తే ఆ దుస్థితి ముందే వచ్చినట్టు కనిపిస్తున్నది. గత ఏడాదితో పోలిస్తే ఫిబ్రవరి నుంచే అధిక ఉష్ణోగ్రతల నమోదు మొదలైంది. మార్చిలో సాధారణం కంటే రోజువారీ ఉష్ణోగ్రతలు నాలుగైదు డిగ్రీలు ఎక్కువగానే రికార్డయ్యాయి. దేశమంతటా ఇదే పరిస్థితి నెలకొన్నది. ఈ ఏడాది మార్చి-మే నెలల మధ్య ఎండ చండప్రచండంగా ఉంటుందని ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా పనిచేసే ప్రపంచ వాతావరణ పరిశోధన సంస్థ ముందే అంచనావేసింది. ఎల్‌నినో కారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఆ సంస్థ ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి మించి పెరగడాన్ని ఎల్‌నినో అంటారు. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటి 32 నుంచి 34 డిగ్రీల సెల్సియస్‌కు చేరితే ఆ పరిస్థితిని 'సూపర్ ఎల్‌నినో' అంటారు. ఉష్ణోగ్రతలకు మించి వేడి తీవ్రత ఉండటాన్ని వాతావరణ శాస్త్రవేత్తలు 'ఫీల్ లైక్ టెంపరేచర్' అంటారు. గాలిలో తేమ శాతం తగ్గడమే దీనికి కారణమని, తద్వారా ఉక్కపోత ఎక్కువ ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. వడదెబ్బ మృతుల సంఖ్య ఈ సారి పెరిగే ప్రమాదం ఉన్నట్టు హెచ్చరించారు. 2024 జూన్ నాటికి ఎల్‌నినో ప్రభావం క్షీణించి, పరిస్థితి సాధారణస్థితికి వస్తుందని ప్రపంచ వాతావరణ సంస్థ తెలిపింది. మే చివరి నాటికి లానినో ఏర్పడుతుందని, ఫలితంగా వర్షాకాలంలో మునుపటి కంటే వానలు బాగా పడతాయని శాస్త్రవేత్తలు తెలిపారు.

పిల్ పై విచారణ

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సందర్భంగా చేపట్టే బదిలీల్లో ఎక్సైజ్ అధికారులకు మినహాయింపు ఇవ్వడాన్ని సవాల్‌చేస్తూ సికింద్రాబాద్‌కు చెందిన బీ నాగధర్‌సింగ్ దాఖలు చేసిన పిల్‌ను ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాదే, జస్టిస్ అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. ఎన్నికల సంఘం నిరుడు డిసెంబర్‌నాటి మార్గదర్శకాల ప్రకారం మూడేళ్లకు పైబడి ఉన్న ఉద్యోగులను బదిలీ చేయాలని, గత ఫిబ్రవరి నాటి సూచనల్లో ఎక్సైజ్ అధికారులకు మినహాయింపు ఇవ్వడం అధికార దుర్వినియోగానికి దారితీసేలా ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్‌దేశాయ్ ప్రతివాదన చేస్తూ... అక్రమ మద్యం కట్టడికి ఎక్సైజ్ అధికారులే అవసరంలేదన్నారు. హైకోర్టు తీర్పును వాయిదావేస్తున్నట్లు ప్రకటించింది.